వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 286
మంగళవారం | 28 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

## డ్రా పద్ధతిలో జట్ల ఎంపిక

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు



2లో..

# విన్నర్ ఎవరో?



## గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

## అంచనాకు అందని ఓటరునాడి

## ఎమ్మెల్సీ ఎన్నికలో తగ్గిన ఓటింగ్ శాతం

## సైలెంట్ ఓట్లతోనే సమస్య

## అందరిలోనూ టెన్షన్..టెన్షన్

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. మొత్తంగా 72.37శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు ప్రకటించారు. అయితే గతంతో పోల్చుకుంటే పోలింగ్ శాతం కొంత తగ్గినప్పటికీ ఈ సారి జరిగిన సైలెంట్ ఓటింగ్ ఎవరి కొంప ముంచనుందో అన్న ఆందోళన అందరిలో నెలకొంది. గతంలో ఓటు వేసిన తరువాత ఓటరు ఏదో రకంగా తానెవరివైపు మొగ్గుచూపారో చెప్పకనే చెప్పే పరిస్థితులు ఉండేవి. కాని ఇటీవల జరిగి పార్లమెంట్ ఎన్నికలతోపాటు సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని వెల్లడించేందుకు ఓటర్లు సుముఖత చూపలేదు. దీంతో సైలెంట్ ఓటింగ్ ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలం అన్నది ఓటింగ్ సరళిని బట్టి అర్థం చేసుకోవడం కష్టంగా మారింది. ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సమరంలో మూడు ప్రధాన పార్టీలతోపాటు మొత్తం 52మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అయితే విజయంపై అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బీఆర్ఎస్, బీజేపీలు భారీగానే అంచనాలు పెట్టుకున్నాయి. ఫలితం తమకు అనుకూలంగానే వస్తుందంటూ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఏదీ ఏమైనా ఫలితం కోసం జూన్ 5వ తేదీ వరకు వేచి చూడాల్సిందే..

- వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..



8లో

## ఆర్టీవో కార్యాలయంపై..
# ఏసీబీ దాడులు

అదుపులోకి డ్రైవర్‌తోపాటు ఆరుగురు ఏజెంట్లు

భారీగా నగదు స్వాధీనం | విచారిస్తున్న అధికారులు




8లో

# దుబాయ్ వెళ్లేందుకు చోరీలు

అరెస్ట్ చేసిన పోలీసులు

270 గ్రాముల బంగారు అభరణాలు, రూ.50వేల నగదు స్వాధీనం





2లో

## కౌంటింగ్‌పై వీడియో కాన్ఫరెన్స్

పాల్గొన్న కలెక్టర్, సీపీ

# విన్నర్ ఎవరో?




**గెలుపుపై ఎవరి ధీమా వారిదే..**
**అంచనాకు అందని ఓటరునాడీ**
**ఎమ్మెల్సీ ఎన్నికలో తగ్గిన ఓటింగ్ శాతం**
**సైలెంట్ ఓట్లతోనే సమస్య**
**అందరిలోనూ టెన్షన్.. టెన్షన్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అక్కడక్కడ చిదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ సజావుగా సాగింది. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 4గంటలకు ముగియాల్సి ఉన్నప్పటికీ అప్పటికే ఓటర్లు బారులు తీరి నిలువడంతో వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్ సాగింది. ఉప ఎన్నిక పోరులో 52మంది అభ్యర్థులు పోటీ పడడంతో బ్యాలెట్ పేపర్ కూడా భారీగానే ఉంది. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 605 పోలింగ్ కేంద్రాల్లోని బ్యాలెట్ బాక్సులన్నింటినీ నల్లగొండకు తరలించే ప్రక్రియ అర్ధరాత్రి తరువాత కూడా కొనసాగింది.

## తగ్గిన పోలింగ్ శాతం..

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో గతంతో పోల్చితే పోలింగ్ శాతం కొంత తగ్గింది. 2021 ఎన్నికలో 5,05,565 మంది ఓటర్లుగా తమ పేరును నమోదు చేసుకోగా అందులో 3,85,996 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంతే పోలింగ్ 76.35 శాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. 2024 ఉప ఎన్నికలో మొత్తం 4,63,839 మంది ఓటర్లు తమ పేరును నమోదు చేసుకోగా మొత్తంగా 72.37శాతం పోలింగ్ నమోదైంది.




## నల్లగొండలో కౌంటింగ్..

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 605 పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ బాక్సులన్నింటినీ నల్లగొండ సమీపంలోని దుప్పపల్లి వేర్ హౌజింగ్ గోదాముల్లోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ ప్రక్రియ సోమవారం అర్ధరాత్రి తరువాత కూడా కొకసాగింది. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఈ ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియను జూన్ 5వ తేదీన నిర్వహించనున్నారు. అయితే 52మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున బ్యాలెట్ పేపర్ కూడా బారీగానే ఉంది. దీంతో కౌంటింగ్ ప్రక్రియకు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## పార్లమెంట్ ఎన్నికలపై ఆసక్తికర చర్చ..

2019 పార్లమెంట్ ఎన్నికల్లో 62.72 శాతం పోలింగ్ శాతం నమోదు కాగా ఫలితాలు ఆశ్చర్యపరిచాయి. రెండోసారి 88 అసెంబ్లీ స్థానాలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ తొమ్మిది ఎంపీ స్థానాలను గెలుచుకుంది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 65 శాతం పోలింగ్ నమోద్కెంది. వరంగల్ లోక్ సభ స్థానానికి 64.08, మహబూబాబాద్ లో 71.85శాతం పోలింగ్ నమోదైంది. ఆరేడు స్థానాల్లో రాష్ట్ర పోలింగ్ సగటు కన్నా ఎక్కువ పోలింగ్ శాతం నమోద్కెంది. పట్టణ ఓటరు కన్నా గ్రావీణ ఓటరే ఎక్కువ చ్కెతన్యం ప్రదర్శించాడు. దీంతో పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోద్కెంది. లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న చేపట్టనున్నారు. లోక్ సభ ఎన్నికలను జాతీయ పార్టీలు రెండూ తొలి నుంచీ ద్విముఖ పోటీగానే భావించాయి. ఈ భావనను, వాటి ఆశలను బీఆర్ఎస్ తలకిందులు చేసి విజయ పథాన నిలుస్తుందా లేక రెండు జాతీయ పార్టీల ముందు నీరసించి పోతుందా అన్న విషయం తేలాలంటే నాలుగో తేదీ వరకు వేచి చూడాల్సిందే..

# కౌంటింగ్‌పై వీడియో కాన్ఫరెన్స్

## పాల్గొన్న కలెక్టర్, సీపీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జూన్ 4న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియపై మంగళవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చేపట్టాల్సిన చర్యలు, తీజుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య, వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, సంభందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హనుమకొండలో..

పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈసీఐ నియమ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఇతర సిబ్బందికి కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నమూనా




ఈవీఎం ద్వారా కౌంటింగ్ సంబంధించిన నిర్వహణ అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి జూన్ 4వ తేదీన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని కౌంటింగ్ కేంద్రంలో నిర్వహించే ఓట్ల లెక్కింపులో పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. కౌంటింగ్ లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబంధిత ఏఆర్వోలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల ఏఆర్వోలు డాక్టర్ కె.నారాయణ, వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డ్రా పద్ధతిలో జట్ల ఎంపిక

## గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులకు క్రీడలు నిర్వహించాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా పేర్లు నమోదు చేసుకున్న వారిని జట్లుగా ఎంపిక చేసే కార్యక్రమానికి మంగళవారం కార్యవర్గం శ్రీకారం చుట్టింది. సీనియర్ క్రీడాకారులు, క్రీడా అధికారుల సూచనలను పరిగణనలోకి తీసుకుని జట్ల ఎంపిక జరుగుతున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. క్లబ్ సభ్యులు కాని వారు కొందరు క్రీడల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలో సభ్యులు కాని వారి పేర్లను పరిగణనలోకి తీసుకోవటం వల్ల వచ్చే ఇబ్బందులను కార్యవర్గం సుదీర్ఘంగా చర్చించింది. అనవసర వివాదాలకు తావివ్వ కూడదనే ఉద్దేశ్యంతో క్లబ్ లో సభ్యులు కాని వారిని క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించవద్దని నిర్ణయించింది. క్రీడల నిర్వహణకు క్లబ్ కార్యవర్గంలోని అందరూ భాగస్వామ్యం కావాలని నిర్ణయించి, పలు కమిటీలు వేసి బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. తదుపరి సమాచారం ఎప్పటికప్పుడు గౌరవ సభ్యులకు తెలియజేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, గోకారపు శ్యాం, నయీమ్ పాషా, విజయ్ రాజ్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో.. దశాబ్ది ఉత్సవాలు



## మూడు రోజుల వేడుకలకు కేసీఆర్ ఆదేశాలు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాలతో జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా వేడుకలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న తెలంగాణ భవన్‌లో నిర్వహించే కార్యక్రమానికి కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ వేడుకల్లో తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరులను స్మరించుకోనున్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకోనున్నారు. ఈ చారిత్రక సందర్భంలో దశాబ్ది ముగింపు వేడులను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా కార్యకర్తలు, పార్టీ అందించే సూచనలను అనుసరించి ముగింపు వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

# డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

## శుభ్రం చేయని మునిసిపల్ సిబ్బంది



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మానుకోట మున్సి మునిసిపాలిటీ పరిధిలోని 33వ వార్డు పరిధిలోని డ్రైనేజీ కాలువలలో గత కొన్ని రోజులుగా చెత్తను శుభ్రం చేయకపోవడంతో డ్రైనేజీ కాలువలలో చెత్త పేరుకుపోయిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ సిబ్బంది చెత్తను తొలగించకపోవటంతో అపరిశుభ్ర వాతావరణ నెలకొంది. ఇండ్ల మధ్యలో ఉన్న డ్రైనేజీ కాలువలలో చెత్తను తొలగించకపోవడంతో దోమలు, ఈగలు చేరి అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. గత కొన్ని రోజులుగా మునిసిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా చెత్తను శుభ్రం చేయటం లేదని, ఇకనైనా అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలో ఉన్న చెత్తను శుభ్రం చేయాలని వేడుకుంటున్నారు.

# శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామికి పూజలు



**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిల్పూర్ లో స్వామివారికి మంగళవారము శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని, స్వామివారికి వివిధ పండ్ల రసాలతో అభిషేకం, చందనోత్సవం, అష్టదళ పాద పద్మారాధన సేవ, హోమం, కళ్యాణం, పూజలు నిర్వహించారు. ఈ పూజలు కరీంనగర్ కు చెందిన కిషన్ పటేల్ రూ. 19016, హనుమకొండకు చెందిన పొట్లపల్లి శ్రీధర్ రావు కిరణ్మయి రూ. 8000, హైదరాబాద్ కు చెందిన వెంకట్రామిరెడ్డి రూ.8000, మహబూబాబాద్ కు చెందిన చందర్ రూ.6200, చిల్పూర్ గుట్టలకు చెందిన గొల్లపల్లి సారయ్య రూ.5000, రాజేష్ ఫ్రూట్స్ రూ.6000, గుల్లపల్లి శ్రీనివాస్ రూ.1700, హైదరాబాద్ కు చెంవిన కిషోర్ కుమార్ శానా రూ.6000లు విరాళాల సహకారంతో నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి బి.లక్ష్మీ ప్రసన్న, అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది, వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ వారోత్సవాలు



**వరంగల్ వాయిస్, పరకాల :** మున్సిపాలిటీ ఒకటో వార్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఒకటో వార్డులో మున్సిపల్ సిబ్బంది చేత స్థానిక కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ సానిటేషన్ పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రజలు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండే విధంగా పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా ఇంటింటికి చెత్త సేకరణ, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు తీయించడం, వీధులలో చెత్త ఉండకుండా శుభ్రపరచడం, నల్లాల ద్వారా ప్రతి ఇంటికి నీళ్లు అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి గంజి వెంకటరెడ్డి, జవాన్ నాగరాజ్, వార్డు ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొమురం భీం-సమ్మక్క, సారక్క స్ఫూర్తితో డీబీఎఫ్ ఉద్యమిస్తుంది



### రేపటి డీబీఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

### ఏబీఎస్, డీబీఎఫ్ నాయకులు కలకోటి మహేందర్, మాదాసి సురేష్

**వరంగల్ వాయిస్, (తాడ్వాయి) ములుగు :** ఆదివాసీ పోరాట యోధులు, ఓరుగల్లు వీర వనితలైన సమ్మక్క-సారక్క, కొమురం భీంల స్ఫూర్తిగా సమ సమాజం కోసం దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఉద్యమిస్తుందని అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ అన్నారు. మంగళవారం ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలో వారీవురూ మాట్లాడుతూ రేపు హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగబోయే డీబీఫ్ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 1995లో ఏర్పడిన డిబీఎఫ్ సమాజంలో పీడించబడుతున్న ప్రజల పోరాట గొంతుగా నిలుస్తూ గత మూడు దశాబ్దాలుగా కళ్ళు లేని వారి వెలుగుగా.. కాల్లులేని వారి నడకగా.. చెవులు లేని వారి స్పందనగా.. మూగవారి గొంతుకగా.. అనేక ప్రజా పోరాటాలకు నాంది పలుకుతూ బహుజన రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు మేకల సాంబయ్య, గిన్నారపు ప్రసంగి, గిన్నారపు శ్రీకాంత్, సోయం సాయికుమార్, ఎడ్మ అశోక్, రాజేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల పక్షపాతి ఎన్టీఆర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ ఆధ్వర్యంలో విశ్వవిఖ్యాత నటుడు, దివంగత నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి, అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చిలువేరు రవీందర్ మాట్లాడుతూ 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు, పేదవారికి రెండు రూపాయలకే కిలో బియ్యం, బీదవారికి రేషన్ షాప్ పై చేనేత వస్త్రాలు, రైతన్నకు ఉచితంగా కరెంట్, మహిళా మణులకు ఆస్తిలో సమాన హక్కు, మహిళలు విద్యారంగంలో ముందుండాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ నెలకొల్పిన గొప్ప మహానుభావుడు మహనీయుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం అని నమ్మిన సిద్ధాంతం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ నడిబొడ్డున హిమాయత్ నగర్ లో తెలుగుదేశం పార్టీని స్థాపించారు. తెలంగాణలో పోలీస్ పటేల్ పట్వారి వ్యవస్థను రద్దుచేసి మండల వ్యవస్థను స్థాపించి ప్రజల వద్దకే పాలన తీసుకువెళ్లిన గొప్ప నాయకుడు నందమూరి తారక రామారావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు చిలువేరు రవీందర్, శిరబోయిన రాజు, పరిగెల సుధాకర్, సింగారపు దేవేందర్, కాంద్రాతి శ్రీకాంత్, పోలేపాక సాయికుమార్, కాంద్రాతి రాజు, తవుటం సంపత్, సింగారపు మురళి, అనుముల రాజు పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలి

### డాక్టర్ అనితా రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ సొసైటీ ఆద్వర్యంలో ది.నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హనుమకొండ కలెక్టరేట్ దగ్గరలోని అనాథ బాలికల బాలసదనం వసతి గృహం విద్యార్థులకు మంగళవారం ఉచితంగా లాంగ్ నోట్ బుక్స్, స్టేషనరీ, స్నాక్స్, మంగపేటకు చెందిన దాసరి రాము, మానస దంపతుల కూతురు అమృత వర్షిణి జ్ఞాపకార్థం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఉండే పిల్లలు అంతా పేద, అనాథ పిల్లలని అన్నారు. పిల్లలకు వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు ప్రారంభానికి ముందే నోట్ బుక్స్, స్టేషనరీ అవసరం ఉండడంతో వారికి సహరించడానికి అందించామని, అలాగే బాలసదనం పిల్లలకు, శిశు గృహ పిల్లలకు పండ్లు, బిస్కెట్లు, కేక్స్ పంపిణీ చేయడం జరిగిందని, పిల్లలు బాగా చదువుకోవాలని కోరారు. మరో అతిథి రిటైర్డ్ సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో మంచి నడవడికతతో ఒక లక్ష్యం పెట్టుకొని చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకోవాలన్నారు. అప్పుడే మంచి ఉద్యోగాలు వస్తాయని, ఉన్నత స్థానాలు చేరుతారన్నారు. అందివచ్చిన అవకాశాలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, రిటైర్డ్ సీడీపీఓ విజయలక్ష్మీ, దాసరి రాము, మానస, చరణ్ కుమార్, గోకారపు మౌనిక, బాలదనం నిర్వహణ సిబ్బంది రాజేశ్వరి, విద్యార్దులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ లోని కళ్యాణమండపంలో వృద్దులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డిల ఆదేశానుసారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో 60 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందిచడం జరుగుతుందని, ప్రతి నెల మీ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరుగుతుందన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామాలలోని వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలని పాలకవర్గం తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరము మాజీ ఎంపీటీసీ బాలసాని రమేష్ అధ్వర్యంలో జరిగింది. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా.జె. కిషన్ రావు, డా. మొహమ్మద్ తహర్ మసూద్, కమలాపూర్ సి ఐ హరికృష్ణ, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, అరువ గంగాధర్, అనిల్, జక్కోజు నరసింహ చారి, రాజు, నాయకులు జనగాని శివ కృష్ణ, పెరుమాళ్ల పరుశరాములు, మార్గం భిక్షపతి గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో 106 మందికి షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితముగా మందుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

## ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్




**వరంగల్ వాయిస్, మహబూబాద్ :** నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన, పరిజ్ఞానం పెంచుకోవాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ అన్నారు. జులై 1 నుంచి అమలయ్యే నూతన చట్టాలపై వర్క్ షాప్ ఆన్ న్యూ క్రిమినల్ లాస్ మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ మాట్లాడుతూ కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు విడతల వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యలలో భాగంగా కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు - భారతీయ న్యాయ సంహిత ( బీఎన్ఎస్ ), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ)-2023 ఈ మూడు చట్టాలు రానున్న జూలై 1, 2024 నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్ కు ఎవరు అర్హులు, చార్జీషీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలనేది తెలుస్తుందన్నారు. తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు చేర్పులు చేశారని తెలిపారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కొరూ నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. క్రిమినల్ చట్టాలు మారుతున్న కాలానికి, అవసరాలకు అనుగుణంగా నవీకరించబడ్డాయని అన్నారు. క్రిమినల్ చట్టాల సూక్ష్మ నైపుణ్యాలను, కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సమాజానికి వాటి ఆచరణాత్మక ఉపయోగం, చుట్టూ జరుగుతున్న నేరాల గురించి ఎస్పీ క్లుప్తంగా వివరించారు. వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీసు శాఖకు చెందిన డీఎస్పీ నుంచి కానిస్టేబుల్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ శిక్షణ గంద్రతి మోహన్ డీఎస్పీ ఫంక్షన్ వర్టికల్స్ నేత్రత్వంలో సీఐ డీసీఆర్ బీ సత్యనారాయణ, ఉపేందర్ సీఐ డోర్నకల్, ఎస్.ఐ రమాదేవి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ట్రైనీ ఐపీఎస్ చేతన్ పండరే, టౌన్ డీఎస్పీ తిరుపతి రావు, సీఐ దేవేందర్ పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

## మండల ప్రత్యేక అధికారి సుధాకర్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** అమ్మ ఆదర్శ పాఠశాల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వెటర్నరీ డాక్టర్ సుధాకర్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా మరిపెడ మండలంలోని నీలికుర్తి ,రాంపురం, బావోజీ గూడెం, నేతావత్ పర్కజల్ తండా గ్రామాలలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రేవతితో కలసి విస్తృతంగా పర్యటించి స్కూల్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రభుత్వం ఇప్పటికే 25 శాతం నిధులను విడుదల చేసినందున త్వరితగతిన పనులు పూర్తిచేయలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ, పాఠశాలలను రూపురేఖలు మార్చే విధంగా ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో జరిగే పనులు పర్యవేక్షించాలని ఆర్అండ్బీ సహాయక ఇంజినీర్ శివకుమార్‌ను ఆదేశించారు.

# ఉపాధి కూలీలపై కోతుల దాడి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి గ్రామంలో గత కొన్ని రోజులుగా కోతుల బెడదతో గ్రామ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా మంగళవారం ఉపాధి హామీ కూలీలు పనులకు వెళ్తున్న క్రమంలో కోతుల గుంపు వారిపై దాడి చేసింది. ఈ సంఘటనతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానిక గ్రామపంచాయతీ సమీపంలో ఉదయం ఉపాధి పనుల నిమిత్తం కూలీలు వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా కోతుల గుంపు వారిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన వంగర మల్లయ్యపై కోతులు దాడి చేశాయి. దీంతో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి కోతుల నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కౌకొండలో హనుమాన్ సంకీర్తన



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కౌకొండ గ్రామంలో మంగళవారం హనుమాన్ మాలాధారణ స్వాములు ఉమామహేశ్వర ఆలయం నుంచి బయలుదేరి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో తిరుగుతూ శ్రీరామ నామం జపిస్తూ, పాటలు పాడుతూ, భజనలు చేస్తూ హనుమాన్ నగర సంకీర్తన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉదయం నాలుగు గంటలకే ఊరు ఊరంతా శ్రీరామ నామంతో మార్మోగింది. అందులో ఒక బాలస్వామికి హనుమాన్ వేషధారణ వేసి కన్నులవిందుగా స్వాములంతా ఊరేగింపుగా భజనలు చేస్తూ వీధుల్లో తిరగడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు అంత ఇండ్లను శుద్ధి చేసుకుని మహిళలు హనుమాన్ స్వాములకు మంగళహారతులు ఇచ్చి పాడి పంటలు బాగుండాలని, గ్రామ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ దేవదేవున్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు దౌల్తాబాజి చందర్ రావు, అల్లె బాంబు రమేష్, లింగాల తిరుపతి, బాలస్వాములు అబ్బోజు హరికృష్ణ చారి, ముక్కెర అభిరామ్, లింగాల స్వాతిప్రసన్న గ్రామంలోని హనుమాన్ దీక్ష స్వాములు గ్రామంలోని భక్తులు పాల్గొని హనుమాన్ నగర సంకీర్తనను జయప్రదం చేశారు.

# యువత చైతన్యంతోనే సమాజంలో మంచి మార్పులు

## సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యువతే దేశానికి వెన్నుముక, సమాజంలో మంచి మార్పులు రావాలంటే యువత చైతన్యం ముఖ్యమని, ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటింగ్ లో ఉత్సాహంగా పాల్గొని ఓటు వేసిన యువతకు నా హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని ప్రముఖ సామాజికవేత్త ఓటర్ చైతన్య పోరాట యోధుడు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎలక్షన్లతో పాటు నిన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో జిల్లాలోని యువత ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువల పట్ల వారికి ఉన్న అంకిత భావాన్ని చాటారని, ఇది గొప్ప శుభ పరిణామమని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎలక్షన్స్ సందర్భంగా తాను 30 రోజుల పాటు నిర్వహించిన ఓటర్ చైతన్య అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చినట్లు ఓటింగ్ శాతాన్ని చూస్తే తెలుస్తుందని, జిల్లా అధికారులు కూడా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ముఖ్యంగా నిర్వహించిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేలా డిజిటల్ పత్రికల సేవలు ఎనలేనివని ఈ సందర్భంగా పత్రికా యాజమాన్యాలకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# బీఆర్ఎస్‌కు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ రాజీనామా



**వరంగల్ వాయిస్, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాయిత విఠల్ తన పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకరులకు స్పష్టమైన ప్రకటన విడుదల చేశారు. రాజకీయాలకు అతీతంగా తాను సనాతన ధర్మం వైపు దృష్టిసారించి ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాను కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి, భారత రాష్ట్ర సమితి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే తాను అనుసరిస్తున్న ఆధ్యాత్మిక ధోరణి నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా నడుచుకోవాలనే ధ్యేయంతో ఉన్నట్లు వివరించారు. రాజకీయాలకు తావు లేకుండా ప్రజలందరూ ఆధ్యాత్మిక భావనతో, ధార్మిక చింతనతో జీవితాన్ని కొనసాగించాలని కాయిత విఠల్ సూచించారు.

# డాక్టర్ బానోతు రాముకు ఆరోగ్య రత్న అవార్డు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరంలోని ఎల్లంబజార్ ప్రాంతంలోని శ్రీరామ ఫిజియోథెరపీ క్లినిక్ అధినేత డాక్టర్ బానోతు రామును ఆరోగ్య రత్న అవార్డు వరించింది. సుమన్ ఆర్ట్ థియేటర్స్ సంస్థ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా హైదరాబాదు లోని భాస్కర ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండ రాంరెడ్డి, నిమ్స్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డిల చేతుల మీదుగా డాక్టర్ రాము ఈ అవార్డు అందుకున్నారు. ఫిజియో థెరపిస్టుగా గత 11 సంవత్సరాలుగా న్యూరాలజీ విభాగంలో 40 వేల మందికి సేవలందించినందుకు గాను రామును ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రతీక్, సుమన్ లు తెలిపారు. కాగా, డాక్టర్ రాము ఆరోగ్యరత్న అవార్డు అందుకోవడం పట్ల నగరానికి చెందిన పలువురు ఫిజియో థెరపిస్టులు, ఆయన శిష్యులు హర్షం వ్యక్తం చేశారు.

# షేర్ మూలా.. పేదల పాలిట మరణ మూలా

## బీజేపీ నేత మాదాసు రాజు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పది మంది మహిళుల గ్రూపుగా ఏర్పడి అప్పు తీసుకొని వారం వారం కట్టే పద్ధతిలో బంధన్ బ్యాంక్, ఐడీఎఫ్ సీ బ్యాంక్ అని, ఫెడరల్ బ్యాంక్ అని కొత్త సంస్థలు వచ్చి పేదల నడ్డి విరుస్తున్నాయి. వాయిదా పద్ధతిలో చెల్లించేలా మహిళలకు డబ్బులు లోన్ గా ఇస్తున్నారు. ఈ గ్రూపులో పని చేసే ఒక మహిళను లీడర్ ను ఎంచుకొని నచ్చిన వారికి డబ్బులు ఇస్తూ పేదలపై రుణ భారం వేస్తున్నారు. ముందు వెనుకా ఆలోచించకుండా వారు అప్పులను తీసుకుంటున్నారు. ఇది ఇలా కొనసాగితే రుణ వాయిదాలు చెల్లించలేక పేదలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రావచ్చని బీజేపీ నేత మాదాసు రాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్యాంకులు ఇస్తున్న ఈ పద్ధతిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకొని అడ్డుకట్ట వేయకపోతే రాబోయే రోజులలో చాలా దారుణాలు చూడవలసి వస్తుందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు పేర్కొన్నారు.

# విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** విద్యార్థులకు టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గుడ్ న్యూస్ చెప్పారు. వరంగల్ లోని టీజీఎస్ ఆర్టీసీ ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడ్లలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించారు. అర్హత కలిగిన విద్యార్థులు జూన్ 10లోపు ఆన్ లైన్ (https://iti.telangana.gov.in)లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మోటార్ మెకానిక్ వెహికిల్, మెకానిక్ డిజిల్, వెల్డర్, పెయింటర్ ట్రెడ్‌లలో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు.

## కాకతీయ సమగ్ర చరిత్ర పుస్తకావిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రచయిత రావుల సుదర్శన్ రచించిన కాకతీయ సమగ్ర చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ఈ కార్ర్యమానికి వేయి స్తంభాల గుడి ప్రధాన అర్చకుడు, బ్రహ్మశ్రీ గంగు ఉపేంద్ర శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. జీవీఎస్ శ్రీనివాసచారి, ఆర్.మురళి, పులి రజినీకాంత్, గంద్రతి రాజు, పారుపెల్లి రవికుమార్, నాగపురి సంతోష్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి బాధాకరం
### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామంలో సోమవారం చేనేత కుటుంబానికి చెందిన దుంప సుధాకర్ కుమారుడు సాయి చరణ్(14), అక్క చిట్యాల మండలం వెంకట్రావు పల్లి గ్రామ నివాసురాలు రామలక్ష్మి(55) విద్యుత్ షాక్ కు గురై మృతి చెందడం అత్యంత బాధాకరమని సీపీఐ రాష్ట్ర నాయకుడు పిడిసిల్ల గ్రామ మాజీ సర్పంచ్ తాటిపాముల వెంకట్రాములు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తీగపై బట్టలు ఆరవేస్తుంటే విద్యుత్ షాక్ ప్రమాదంలో ఇద్దరు అమ్మమ్మ, మనవడు మృతి చెందడం విషాదకరమన్నారు. శోక సంద్రంలో ఉన్న ఆ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న అత్యంత నిరుపేదలైన ఆ రెండు కుటుంబాల వారికి రూ. 20 లక్షల రూపాయల చొప్పున ఎక్స్ గ్రేసియో చెల్లించి ఆదుకోవాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు ప్రజలే దేవుళ్ళు సమాజమే దేవాలయం అని తెలుగుదేశం పార్టీ స్థాపించి పట్వారి పటేల్ వ్యవస్థ రద్దు చేయడం జరిగింది. అలాగే రెండు రూపాయల కిలో బియ్యం లాంటి గొప్ప పథకాలను ప్రవేశపెట్టి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. నేడు ఆయన జయంతి సందర్భంగా వరంగల్ కాశిబుగ్గ తూర్పు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, చంద్రబాబు యువసేన జాతీయ అధ్యక్షుడు చెన్నోజు రఘుబాబు ఆధ్వర్యంలో 200 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ హరి, దాస్యం సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## తెలుగు ప్రజలందరీ ఆత్మీయుడు ఎన్టీఆర్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** నందమూరి తారక రామరావు జయంతి వేడుకలను డోర్నకల్ పట్టణ ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే అధికారం చేపట్టిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని పలువురు పేర్కొన్నారు. దళిత గిరిజన, మహిళలకు రిజర్వేషన్ కల్పించి పేదలను ఆదుకున్న ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని కొనియాడారు. బికసాని రామకృష్ణ, వెంకట్రాం, నాగేశ్వర రావు, సత్తిరెడ్డి, తాళ్లూరి హనుమ, రమణ, పోట జనార్దన్, వకంతుల రవి, శేఖర్, మాద శ్రీనివాస్, వేణు, అర్జున్ సింగ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

## వేరు వేరు సంఘటనల్లో ఇద్దరి మృతి

**వరంగల్ వాయిస్, శాయంపేట :** పత్తిపాక గ్రామానికి చెందిన దుర్శెట్టి కుమారస్వామి 27వ తేదీ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో రోడ్ పై నడుచుకుంటూ వెళ్తుండగా కోతుల మంద మీదికి రాగ కుమారస్వామి ప్రమాదవశాత్తు కిందపడగా తలకు బలమైన గాయమై అక్కడి కక్కడే మృతి చెందారు. మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. అలాగే, కొప్పుల గ్రామానికి చెందిన బేతి బుచ్చిరెడ్డి ఈనెల 15న తన టు వీలర్ వాహనంపై కొప్పుల గ్రామానికి వెళుతుండగా మైలారం గ్రామానికి చేరకోగానే కుక్క అడ్డం వచ్చి ప్రమాదవశాత్తు బండి కింద పడిబలమైన గాయాలై కోమాలోకి వెళ్లాడు. దీంతో అతడిని వరంగల్ ఎంఎం హాస్పిటల్ కు తరలించి ఆ రోజు నుంచి చికిత్స అందిస్తుండగా మంగళవారం చనిపోయాడు. మృతిడి భార్య సుజాత ఫిర్యాదుతో ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం పెంచండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం పెంచాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ వరంగల్ పరిధికి సంబంధించి ఏఈల వారీగా ఇప్పటి వరకు పూర్తయిన నిర్మాణంలో ఉన్న పనుల స్థితిగతులను డీఈలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ పరిధిలో గల పాఠశాలల్లో పనులలో వేగం పెరగాల్సిన అవసరం ఉందని, ప్రధానంగా స్కూళ్లలో తాగునీటి వసతులు ఏర్పాటు వంటి ప్రాథమిక అవసరాల పై ప్రత్యేక దృష్టి సారించి ముందుగా పూర్తి చేయాలన్నారు. ముందుగా మైనర్ సంబంధిత పనులను పూర్తి చేసి మేజర్ పనులపై దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలల్లో టాయిలెట్ నిర్మాణ సంబంధిత పనులు మినహా మిగతా పనులన్నీ ఈ నెల 31 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులను వేగంగా పూర్తి చేయడానికి లేబర్ సంఖ్యను పెంచి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, ఈఈలు రాజయ్య శ్రీనివాస్, డీఈలు రవికుమార్, సంతోష్ బాబు, సారంగం, రంగారావు, రవికిరణ్, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలి

### ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కయ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలని ఎం.చుక్కయ్య ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం 2021 నాటికి వ్యవసాయ ప్రణాళికను నిలిపివేసింది. నేడు అత్యవసరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ విధానాన్ని రూపొందించి, ప్రణాళికను ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చుక్కయ్య అన్నారు. అంతేకాక రుణప్రణాళిక ప్రకటించాలని, ఏకకాలంలో రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మడి శ్రీకాంత్ అధ్యక్షతన జిల్లా ఏఐకేఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 6న ఏఐకేఎస్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ సమావేశంలో జిల్లాలో రైతుల ఎదుర్కొంటున్నటువంటి సీజనల్ సమస్యలపై, ప్రభుత్వం ఎన్నికలలో ప్రకటించిన హామీల అమలుపై చర్చించుచున్నట్లు వారు పేర్కొన్నారు. వచ్చేనెల 6న జరిగే సమావేశం హనుమకొండలోని సుందరయ్య భవన్ హాల్ లో జరుగుతుందని, ఉదయం 10గంటలకు రైతు సంఘం ప్రతినిధులంతా హాజరు కావాలని వారు కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి పర్వతాలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన దురిశెట్టి కుమారస్వామి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మరణ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, వరంగల్ జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆదేశానుసారం మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసుల ప్రవీణ్, సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి ఆదిరెడ్డి రూ.2000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండ నారాయణ రెడ్డి, మాందాడి రాజు, అంకెశ్వరపు మొగిలి, వైద్యుల తిరుపతి రెడ్డి, బండ రజినీకర్ రెడ్డి, కుసుమ రమేష్, భోగం సాంబరాజు, తుడుం రవీందర్, గజ్జి రమేష్, ఆకుల శివ బ్రదర్స్, రజక సంఘం సభ్యులు పున్నం సాంబయ్య, రాజయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ ఒక వాహనదారుడికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.1000 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 16 మందికి రూ.15,900 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీధర్ తెలిపారు.

## కోదండరాంను కలిసిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రొఫెసర్ టీజేఏసీ చైర్మన్ కోదండరాంకు వినతి సమర్పించారు. నాంపల్లి టీజేఎస్ కార్యాలయంలో మంగళవారం ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు 2018లో 510 జీఓలో కొంతమందికి అన్యాయం జరిగిందని కోదండరాం దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ప్రొఫెసర్ కోదండరాం 510 జీవోలో అన్యాయం జరిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 510 జీవోలో నష్టపోయిన 4000 కుటుంబాలకు వెలుగులు నింపాలని , చీకటిలో ఉన్నారని గుర్తు చేశారు. ఎవరికైతే అన్యాయం జరిగిందో వారికి న్యాయం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఉద్యోగులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్.హెచ్.ఎం. కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సురేష్, లోకేష్, ఆయూష్ సంగారెడ్డి ప్రెసిడెంట్ శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా ఆయుష్ నవకాంత్, గౌరీ, చంద్రకళ, శ్రీలక్ష్మి, మధు తదితరులు పాల్గొన్నారు.

# రుతుస్రావ పరిశుభ్రతపై అవగాహన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్ఓ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అంబరీష ఆధ్వర్యంలో మంగళవారం అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవంపై 15 నుంచి 49 సంవత్సరాల లోపు స్త్రీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రుతుస్రావ పరిశుభ్రత దినాన్ని పాటించడం వల్ల వ్యక్తులు, వారి రుతు కాలానికి సంబంధించిన సవాళ్లను అధిగమించడంలో సహాయపడవచ్చునన్నారు. ప్రతి సంవత్సరం మే 28న, రుతుస్రావ ఆరోగ్యం ప్రాముఖ్యత, రుతుక్రమ ఉత్పత్తుల సముచిత వినియోగం, రుతుస్రావంలో ఉన్న స్త్రీలను అపోహలకు గురిచేసే, ఆరోగ్య సమస్యలకు దారితీసే పరిస్థితుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. రుతు స్రావ పరిశుభ్రత అనేది స్త్రీలు, కౌమార దశలోని బాలికలకు, రుతుక్రమం వచ్చే వ్యక్తుల గౌరవానికి ప్రతీక అన్నారు. దురదృష్టవశాత్తూ, సామాజిక కట్టుబాట్లు, అపోహలు, సరైన రుతుస్రావ పరిశుభ్రత జ్ఞానం అందుబాటులో లేకపోవడం వల్ల, భారతదేశంలో చాలా మంది వారి రుతుక్రమ సమయంలో సవాళ్లను ఎదురుకుంటున్నారని, ఇది ఆరోగ్య ప్రమాదాలకు దారి తీస్తుందని తెలియచేశారు. బహిష్టు పరిశుభ్రత దినోత్సవం 2024 థీమ్: %శీస్త్రవేష్త్రవతీ టశీతీ ఖ ్రావతీఱశీస టతీఱవఅస్త్రీఎ ఔశీతీశ్రీస% (టుగెదర్ ఫర్ ఫ్రెండ్లీ వరల్డ్) అని తెలిపారు. రుతుస్రావం, లైంగిక ఆరోగ్య సమస్యలు, అవి ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై అవగాహన పెంచడం రుతు పరిశుభ్రత దినోత్సవం ఉద్దేశ్యమని తెలిపారు. పీరియడ్ పరిశుభ్రతను సరైన పద్దతిలోఅవలింభించాలని, జననేంద్రియ ప్రాంతాన్ని సరిగ్గా శుభ్రపర్చుకోవాలని, 4 గంటల కంటే ఎక్కువ సమయం ప్యాడ్ ని ఉపయోగించవద్దని, సువాసన గల ఉత్పత్తులను ఉపయోగించవద్దని వాడిన శానిటరీ ప్యాడులను సరైన రీతిలో పారవేయడం చేయాలన్నారు. రుతుక్రమ సమయంలో సరైన పోషక ఆహారం తీసుకోవడమే కాకుండా సరైన విశ్రాంతి తీసుకోవడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. కొంత మంది స్త్రీలలో రుతుక్రమ సమయంలో తీవ్రమైన కానీ, స్వల్ప అనారోగ్య సమస్యలు ఎదురైన, 5 రోజులకు మించి రుతుస్రావం జరిగిన దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో గానీ, స్త్రీ వైద్య నిపుణులను గాని సంప్రదించాలని సూచించారు. కౌమార దశలోని బాలికలకు పాఠశాలలోని ఉపాధ్యాయినీయులు రుతుక్రమ పరిశుభ్రతపైన అవగాహన కల్పించాలని, స్వచ్ఛంద సంస్థలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ల వారు తయారు చేసే సానిటరీ ప్యాడ్స్ ని కూడా ఉపయోగించుకోవచ్చన్నారు.

## వైభవంగా గోమాత పూజ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20 డివిజన్లో ఈరోజు మంగళవారం సందర్భాన్ని పురస్కరించుకొనిరంగనాథ స్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దక్షిణముఖ ఆంజనేయ స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాన్ని నిర్వహించారు. అలాగే దేవాలయంలో ఉన్న శ్రీ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేశారు. ఆంజనేయస్వామివారిని కరెన్సీ నోట్లతో అలంకరించి, దేవాలయంలో గోమాత పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ గోమాతలో మూడు కోట్ల దేవత మూర్తులు ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగనాథ స్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూర్ సురేష్, దేవాలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు మౌటంశ్రీనివాస్, విరాటి ప్రకాష్ రెడ్డి, వంగరి సమ్మయ్య, నీలం శ్రీనివాస్, రాగుల ప్రసాద్, తలకోటి రమేష్, కూరపాటి రవికుమార్, ఆలయ మహిళా ఉపాధ్యక్షురాలు కూరపాటి రోజా, మంచాల సుజన, భక్తులు గడ్డం భాస్కర్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా నందమూరి తారక రామారావు జయంతి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** హనుమకొండ జిల్లా కాజీపేట చౌరస్తాలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, నటసార్వభౌమ, నటరత్న, పద్మ విభూషణ్, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు బైరపాక ప్రభాకర్, వరంగల్ పార్లమెంటు నాయకులు బర్ల యాకూబ్, కాగితాల జయశంకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు మార్గం సారంగం, చిలువేరు మహేందర్, బైరి శేషాద్రి, కాజీపేట పట్టణ నాయకులు అనిశెట్టి సతీష్, కిన్నెర సుధాకర్, కొండ్రు శంకర్, తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు లోతట్టు ప్రాంతాలపై అవగాహన అవసరం

### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రానున్న వర్షాకాలం నేపథ్యంలో శానిటరీ ఇన్ స్పెక్టర్లకు నగర వ్యాప్తంగా ఉన్న లోతట్టు ప్రాంతాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్ లో సానిటరీ ఇన్ స్పెక్టర్లతో జరిగిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఐటీ నిపుణులు గూగుల్ ఎర్త్ మ్యాపు ద్వారా నగరంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను దృశ్య మాధ్యమం (పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా)ద్వారా ప్రదర్శించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్లకు చెందిన సానిటరీ ఇన్ స్పెక్టర్లకు వారికి కేటాయించిన డివిజన్లలో ముంపునకు గురయ్యే ప్రాంతాలపై పూర్తి పరిజ్ఞానం ఉండాలని, ఆ సమస్యలకు పరిష్కారాన్ని చేపట్టాల్సిన చర్యలపై అవగాహన ఉండాలని, సామర్థ్యం మేరకు నిర్మించని డ్రైన్ల సమాచారాన్ని అందించాలని, వర్షాలు కురిసే క్రమంలో నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రైన్ లు పొంగడానికి గల కారణాలు అన్వేషించాలని, ఆ సమాచారాన్ని గూగుల్ మ్యాప్ ద్వారా సేకరించి అందజేయాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో గార్బేజి డంపింగ్ అనుకున్న స్థాయిలో జరగడం లేదని అనధికారిక డంపింగ్ చేస్తే గుర్తించి పెనాల్టీలు విధించాలని, ప్రతి నిత్యం ఉదయం మధ్యాహ్నం సాయంత్రం 3 దఫాలుగా డంపింగ్ జరగాలని, డ్రైన్ లలో డిసిల్టింగ్ జరిగేలా చూడాలని, ఫాగింగ్ సక్రమం గా జరిగేలా ఎస్ఐలు పర్యవేక్షణ జరపాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డా.రాజేష్, శానిటరీ సూపర్ వైజర్లు సాంబయ్య, నరేందర్, భాస్కర్ తో పాటు శానిటరీ ఇన్ స్పెక్టర్లు, ఐటీ నిపుణులు శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లు దోచుకు తిన్నావ్..

### నడికూడ పెద్ద చెరువు లూటీపై గ్రామస్తుల మండిపాటు

### మాజీ ఎమ్మెల్యే చల్లా వాహనాలు అడ్డుకున్న గ్రామస్తులు




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మట్టి తీయడానికి వచ్చిన పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి వాహనాలను నడికూడ గ్రామస్తులు అడ్డుకొని మట్టి దొంగలను తరిమికొట్టడం జరిగింది. నడికుడ మండల కేంద్రంలో పెద్ద చెరువు లూటీ చేయడానికి మంగళవారం పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి లారీలు, జేసీబీపెద్ద చెరువు కాడికి చెరువులో మట్టి తీయడానికి రాగా అనుమతులు ఉన్న పనులు ప్రారంభం కాకముందే గ్రామస్తులు పెద్ద చెరువులో మట్టి తీసి చెరువును గుంతలమయం చేయకూడదంటూ అనుమతులు ఉన్నా మట్టి తీసేదే లేదంటూ గ్రామస్తులు అడ్డుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పదేళ్లు అధికారం ఉన్నప్పుడు నడికూడ మండల కేంద్రంలో ఉన్న చెరువులను అన్ని గుంతల మయం చేస్తూ మట్టి దోచుకుతిన్నారు. మళ్లీ మళ్లీ కూడా దోచుకు తినడానికి నడికూడ గ్రామానికి వచ్చి చెరువులు లూటీ చేస్తున్నారా అంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు ఉన్న మా చెరువులో మట్టి తీసేదే లేదంటూ గ్రామస్తులు నినాదాలు చేస్తూ మండిపడుతున్నారు. ఆదివారం మట్టి తీయడానికి వచ్చిన వాహనాలను అడ్డుకొని వెనక్కి పంపించినా, మళ్లీ మంగళవారం ఉదయం మట్టి తీయడానికి వాహనాలతో చెరువు కాడికి రావడం జరిగిందని, గుట్టు చప్పుడు కాకుండా మట్టి దొంగలు చెరువులోకి చొరపడి మట్టి తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఫైరయ్యారు. కాబట్టి, మండల జిల్లా అధికారులు చొరవ తీసుకొని నడి కూడ మండల కేంద్రంలో ఉన్న చెరువులలో మట్టి తీయకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అక్రమార్కుల చేతిలో చెరువులన్నీ గుంతల మయం కావడం జరిగిందని, ఇకనైనా అధికారులు అనుమతులు ఇవ్వకూడదని, అక్రమంగా మట్టి తీసిన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.



## ఆరు రోజులు ఎనుమాముల మార్కెట్ బంద్



**వరంగల్ ఎనుమాముల :** ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ మార్కెట్ ఆరు రోజులు పాటు బంద్ ప్రకటించింది. జూన్ 1 నుంచి 6 వరకు వరుసగా ఆరు రోజులు పాటు వ్యవసాయ ఉత్పత్తుల క్రమ విక్రమాలను నిలువనున్నాయి. కాబట్టి, జూన్ 1 వ తేదీ శనివారం నుంచి జూన్ 6 వ తేదీ గురువారం వరకు వరసగా(6) రోజులు పాటు మార్కెట్ బంద్ ఉంటుందని, జూన్ 7 శుక్రవారం రోజున పున:ప్రారంభమగును. ఈ విషయాన్ని రైతు సోదరులు గమనించి తమ వ్యవసాయ ఉత్పత్తులను పైన తెలిపిన బందు రోజులలో తమ సరుకులను మార్కెట్ యార్డునకు తరలించి ఇబ్బందులకు గురి కావద్దని కోరారు.

## బచ్చలమల్లిగా.. అల్లరి నరేష్



'ఆ ఒక్కటీ అడక్కు' తర్వాత హీరో అల్లరి నరేష్ తన తదుపరి ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టారు. అల్లరి నరేష్ అప్ కమింగ్ మూవీ 'బచ్చల మల్లి'లో ఇంటెన్స్ రోల్‌లో కనిపించబోతున్నారు. 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగదేవి దర్శకత్వంలో.. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలను నిర్మించిన హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. నరేష్ మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో మ్యాసీ హెయిర్, గడ్డంతో కనిపిస్తున్నారు. నరేష్ ఇంటెన్స్ సీరియస్ లుక్‌లో రిక్షా మీద కూర్చుని సిగరెట్ తాగుతూ కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో బాణసంచా కాల్చడం, ఫెరోషియస్ దేవుళ్ల గెటప్‌లతో కూడిన కార్నివాల్‌ను గమనించవచ్చు. హై-వోల్టేజ్ సీక్వెన్స్ అన్నట్లుగా ఉన్న ఈ ఫస్ట్‌లుక్ పోస్టర్ చూస్తుంటే.. 'బచ్చల మల్లి' సినిమా ఇంటెన్స్ యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అనేది అర్థమవుతోంది. అల్లరి నరేష్ సరసన అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తోన్న ఈ సినిమాలో రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 'సీతా రామం' ఫేమ్ విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా.. రిచర్డ్ ఎం నాథన్ డివోపీగా పని చేస్తున్నారు. ఛోటా కె ప్రసాద్ ఎడిటర్, ప్రస్తుతం ఈ సినిమా ఆర్ఎఫ్‌సిలో వేసిన సెట్‌లో హీరో ఎమోషనల్ జర్నీ 1990 బ్యాక్ డ్రాప్ తాలుకూ సన్నివేశాలను చిత్రీకరణ జరుపుకుంటోంది. ప్రొడక్షన్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నట్లుగా మేకర్స్ తెలియజేశారు.



## కృతిశెట్టితో కలసి..
## మనమే అంటున్న శర్వానంద్

టాలీవుడ్ హీరో శర్వానంద్ నటిస్తోన్న తాజా చిత్రం మనమే. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ తెరకెక్కుతోంది. కృతిశెట్టి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ నుంచి వెడ్డింగ్ సాంగ్ తప్పా తప్పా అప్‌డేట్ అందించారు మేకర్స్. హీరోహీరోయిన్లపై వచ్చే ఈ సాంగ్‌ను మే 30న లాంఛ్ చేయనున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్ సినిమాపై అంచనాలు పెంచుతోంది. నిరీక్షణ దాదాపు ముగిసింది. ఈ సీజన్ బిగ్గెస్ట్ ఎంటర్‌టైనర్ మనమే జూన్ 7న విడుదల కానుందని ఇప్పటికే తెలియజేశారు మేకర్స్. మేకర్స్ లాంఛ్ చేసిన చిన్నసటె వీడియో సినిమా ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేసింది. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి ఏడిద రాజా అసోసియేట్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.






## అరుదైన వ్యాధితో బాధపడుతున్న
## నటుడు ఫహద్ ఫాసిల్

మాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చి సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న హీరోల్లో ఒకరు మలయాళ నటుడు ఫహద్ ఫాసిల్. ఇటీవలే ఆవేశం సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు. ప్రస్తుతం పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న పుష్ప ది రూల్‌లో కీలక పాత్రలో నటిస్తున్నాడు. కొత్తమంగళంలోని పీస్ వ్యాలీ పాఠశాల ప్రారంభోత్సవానికి ఫహద్ ఫాసిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యాడు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పునరావాసం కల్పించేందుకు తన సహకారం అందించాడు. ఈ సందర్భంగా తన మెంటల్ హెల్త్ గురించి ఫహద్ ఫాసిల్ చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తనకు 41 ఏండ్ల వయసులో ఏడీహెచ్‌డీ అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్ ఉన్నట్టు నిర్ధారణ అయిందని చెప్పాడు. ఇది మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ సమస్య కారణంగా ఎక్కువగా శ్రద్ధ పెట్టలేకపోవడం, కొన్ని సందర్భాల్లో అతిగా ప్రవర్తించడం, తొందరంగా ఆవేశ పడటం లాంటివి తనలో గమనించానని చెప్పాడు. ' ఫహద్ ఫాసిల్ పాఠశాల ఆవరణలో నుంచి వెళుతున్నప్పుడు జబ్బును నయం చేయడం సులభమా అని ఆయనను అడిగాం. ఇది బాల్యంలో నిర్ధారణ అయితే అది సాధ్యమేనన్నారు. 41 ఏళ్ళ వయసులో నిర్ధారణ అయితే అది నయం అవుతుందా అని అడిగితే అప్పుడే తనకు వ్యాధి ఉన్నట్లు వైద్యపరంగా నిర్ధారణ అయిందని చెప్పాడని' స్థానిక మీడియా ఓ కథనంలో రాసుకొచ్చింది. అజాగ్రత్త, హైపర్ యాక్టివిటీ, హైపర్ ఫోకస్, ఇంపల్సివిటీ (ఆకస్మిక నిర్ణయాలు తీసుకోవడం) లక్షణాలు ఏడీహెచ్‌డీ సమస్య ఉన్న వారిలో ప్రధానంగా కనిపిస్తాయి. ఈ పరిస్థితి ఉన్నవారు ఎక్కువగా భిన్నమైన రీతిలో ఆలోచిస్తుంటారు. తమకు ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు గతంలో కూడా చాలా మంది నటీనటులు చెప్పారు. ఆఊఆ రుగ్మత అనేది సాధారణంగా పిల్లలలో గుర్తించబడిన మానసిక రుగ్మతలలో ఒకటి. ఓ వ్యక్తి ఏడీహెచ్‌డీ ఎలా వస్తుందని చెప్పేందుకు నిర్థిష్ట కారణాలేమి లేవు. ఈ రుగ్మతను దూరం చేసేందుకు థెరపీ, మందులు, మానసిక వైద్య నిపుణులను సంప్రదిండటం చేయాల్సి ఉంటుంది.

## చిరంజీవికి అరబ్ ఎమిరేట్స్ గోల్డెన్ వీసా

దేశంలో రెండు అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్‌ను అందకున్న మెగాస్టార్ చిరంజీవి ఇప్పుడు మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) గోల్డెన్ వీసాను ఆయన అందుకున్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి యూఏఈ ప్రభుత్వం ఈ వీసాను అందిస్తుంది. తాజాగా దీన్ని అందుకున్న సినీ ప్రముఖుల లిస్ట్‌లో చిరు చేరారు. దీంతో ఆయనకు అభిమానులు శుభాకాంక్షలు చెబుతున్నారు. పెట్టుబడిదారులు, వ్యవస్థాపకులు, శాస్త్రవేత్తలు, నటులు, అసాధారణ ప్రతిభ కలిగిన గ్రాడ్యుయేట్లకు 10 ఏళ్ల కాలపరిమితితో యూఏఈ ఈ ప్రత్యేక వీసాలను అందిస్తోంది. ఇంతకుముందు.. చిత్ర పరిశ్రమకు చెందిన రజనీకాంత్, షారుక్ ఖాన్, అల్లు అర్జున్, దుల్కర్ సల్మాన్, త్రిష, అమలాపాల్, మోహన్‌లాల్, మమ్ముట్టి, టొవినో థామస్ వంటి స్టార్‌లకు గో÷-డలెన వీసాలను ఇచ్చారు. ప్రస్తుతం చిరంజీవి విశ్వంభర చిత్రంలో నటిస్తున్నారు. వశిష్ట దర్శకత్వంలో సోషియో ఫాంటసీ చిత్రంగా ఇది రూపొందుతోంది. రూ.200 కోట్లతో యు.వి క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్నారు. ఇందులో ఐదుగురు హీరోయిన్లు ఉన్నట్లు టాక్. ఇప్పటికే త్రిష, ఆషికా రంగనాథ్‌లను తీసుకున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. సురభి, ఇషాచావ్లా, మీనాక్షి చౌదరి కూడా ఉన్నట్లు టాక్. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఆర్టీవో కార్యాలయంపై.. ఏసీబీ దాడులు

**అదుపులోకి డ్రైవర్‌తోపాటు ఆరుగురు ఏజెంట్లు**

**భారీగా నగదు స్వాధీనం**

**విచారిస్తున్న అధికారులు**








**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంపై పెద్ద ఎత్తున అవకతవకలు, అవినీతి ఆరోపణలు రావడంతో మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. కార్యాలయంలో అనధికారకంగా ఉన్న ఆరుగురు ఏజెంట్లతోపాటు రవాణా శాఖ అధికారి గౌస్ పాషా డ్రైవర్ సుబ్బారావును అదుపులోకి తీసుకున్నారు. ఏజెంట్ల నుంచి రూ.45,100, డ్రైవర్ నుంచి రూ.16,500 నగదుతోపాటు నూతన లైసెన్స్ లు, రెనివల్స్, ఫిట్ నెస్ కు సంబంధించిన కాగితాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ..గత కొన్ని రోజులుగా మహబూబాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో జరుగుతున్న అవకతవకలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని, దీంతో డీజీపీ సీవీ.ఆనంద్ ఆదేశాలతో ఈ దాడులు నిర్వహించామన్నారు. కార్యాలయంలో ఆరుగురు ఏజెంట్లు, జిల్లా రవాణా శాఖ అధికారి గౌస్ పాషా డ్రైవర్ సుబ్బారావును అదుపులో తీసుకున్నామని వివరించారు. వీరి నుంచి నగదు, పలు కాగితాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏజెంట్లు, డ్రైవర్లు, అనధికార వ్యక్తులు కార్యాలయంలో ఉండకూడదన్న నిబంధనను తుంగలో తొక్కారన్నారు. అదేవిధంగా కౌంటర్లలో పనిచేసే ఉద్యోగుల వద్ద డిక్లరేషన్ కన్నా ఎక్కువ నగదు లభ్యం అయిందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి శాఖా పరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. వీరి వద్ద డీడీలు చెక్కులే ఉండాలన్నారు. అందుకు విరుద్ధంగా వీరి వద్ద నగదు ఉందన్నారు. నగదును స్వాధీనం చేసుకున్నామని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో సీఐలు శ్యాంసుందర్, ఎల్.రాజు, ఎస్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


# దుబాయ్ వెళ్లేందుకు చోరీలు

**అరెస్ట్ చేసిన పోలీసులు**

**270 గ్రాముల బంగారు అభరణాలు, రూ.50వేల నగదు స్వాధీనం**




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సొంత ఇంటి నిర్మాణంతో పాటు దుబాయ్‌కు వెళ్లేందుకు చోరీలకు పాల్పడతున్న అంతర్ జిల్లా దొంగను సీసీఎస్, మట్వాడ పోలీసులు సంయుక్తంగా మంగళవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.22లక్షల విలువల్కెన 270 గ్రాముల బంగారు అభరణాలతో పాటు, రెండు ద్విచక్రవాహనాలు, రూ.50వేల నగదు, ఒక మోబ్కెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టుకు సంబందించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలను వెల్లడిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మండలం, సంకేపల్లి గ్రామం, ప్రస్తుతం సిద్దిపేట జిల్లా చేర్యాలలో నివాసం ఉంటున్న జింక నాగరాజు ద్విచక్ర వాహన మెకానిక్‌గా పనిచేస్తూనే ద్విచక్ర వాహనాల క్రయవిక్రయాలు నిర్వహించేవాడు. సులభంగా పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించి సొంత ఇంటిని నిర్మించడంతోపాటు దుబాయ్ కు పోవాలన్న ఆలోచనతో ద్విచక్రవాహనాలు చోరీ చేసి వాటిని అమ్మి డబ్బును జమ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ ఇదే ఆలోచనతో 2011 నుంచి కరీంనగర్, జమ్మికుంట, కామారెడ్డి, సిద్ధిపేట, వేములవాడ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడి పోలీసులకు చిక్కి జ్కెలు పాల్కెనాడు. జ్కెలు జీవితం అనంతరం కుడా నిందితుడిలో ఎలాంటి మార్పు రాకపోగా, ద్విచక్రవాహనాలు చోరీలకు స్వస్తి పలికి తాళం వేసి ఉన్న ఇండ్లల్లో చోరీలకు సిద్దపడ్డారు. 2016 నుంచి 2022 వరకు నిందితుడు వరంగల్, జనగాం, సిద్ధిపేట, భూపాల్‌పల్లి జిల్లాల్లో మొత్తం 38కి పైగా తాళం వేసివున్న ఇండ్లలో చోరీలకు పాల్పడటంతో పలుమార్లు అరెస్టు చేసి జ్కెలుకు తరలించారు. గత సంవత్సరం మార్చిలో జ్కెలు నుంచి విడుదల్కెన నిందితుడు తాను సొంత ఇంటి నిర్మాణంతో పాటు, దుబాయ్ కి వెళ్ళేందుకు అవసరమయిన డబ్బును సంపాదించాలనే లక్ష్యంగా నిందితుడు మరో మారు చోరీలకు తెగపడ్డాడు. ఇందులో భాగంగా నిందితుడు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధితో పాటు జగిత్యాల, యాదాద్రి జిల్లాలో మొత్తం 20 చోరీలకు పాల్పడ్డారు. ఈ చోరీలపై అప్రమత్తమైన పోలీసులు వరంగల్ పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు ట్రైనీ ఐసీఎస్ శుభం నాగ్ అధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన బంగారు అభరణాలను అమ్మేందుకు ద్విచక్రవాహనంపై వస్తుండగా పక్కా సమాచారంతో మట్వాడా, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా ఆర్ఎన్ టీ రోడ్డులో నిందితుడుని అదుపులోకి తీసుకొని విచారించగా తాను చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు సీపీ వెల్లడించారు. నిందితుడుని పట్టుకోవడంలో ప్రతిభ కనభరిచిన ట్రైనీ ఐసీఎస్ శుభం నాగ్‌తో పాటు సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్‌బారీ, అదనపు డీసీపీ రవి, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, సీసీఎస్, మట్వాడా ఇన్స్‌స్పెక్టర్లు అబ్బయ్య, గోపి, అసిస్టెంట్ అనాటికల్ అఫీసర్ సల్మాన్‌పాషా, సీసీఎస్ ఏఎస్ఐ శివకుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు నజీం, ఆహ్మద్, జంపయ్య, కానిస్టేబుళ్ళు మధుకర్, రాములు, వెంకన్న, కిరణ్‌కుమార్, నజీరుద్దీన్, శ్రీకాంత్‌తో పాటు మట్వాడా ఎస్.ఐ కుమార్ కానిస్టేబుళ్ళు అలీ, హరికుమార్ రాజేందర్, ఐటీకోర్ టీం కానిస్టేబుళ్ళు నగేష్, ప్రవీణ్‌లను వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.



# ప్రసన్నాంజనేయ స్వామికి.. 1,008 వడలతో అలంకరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని పద్మాక్షి కాలనీ లోనున్న శ్రీ హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఐదో రోజు స్వామికి లక్ష తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆరుట్ల రామచార్యులు ఆధ్వర్యంలో 1,008 వడలతో స్వామి వారికి మాల అలంకరణ చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి మాన్య సూక్త హోమములు, గోత్రనామార్చన, తీర్థ ప్రసాద వినియోగం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భజన, అనంతరం అన్నదానం చేశారు. ఇందులో రెండు వందల మంది హనుమాన్ స్వాములు పాల్గొన్నట్లు ఆలయ చైర్మన్ బెండల అర్జున్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, కార్యవర్గ సభ్యులు కర్రు దశరథ్ కుమార్, గంద్రతి సుధాకర్, హనుమాన్ దీక్ష స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు
# నివాళులర్పించిన ప్రముఖులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలసముద్రంలోని ఎన్టీఆర్ ప్రాంగణంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత నందమూరి తారక రామారావు అభిమాన సంఘం గౌరవ అధ్యక్షుడు ఈగ మల్లేశం ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల అభ్యున్యతికి పాటు పడిన మహోన్నత వ్యక్తి యుగ పురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను రూప కల్పన చేసిన మహానుభావుడు అన్నారు. ముఖ్యంగా వంటింటికే పరిమితమైన మహిళల కొరకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించి అనేక మంది మహిళలు రాజకీయంగా రాణించుటకు స్థానిక సంస్థల్లో అవకాశాలు కల్పించిగన గొప్ప వ్యక్తం నందమూరి తారక రామారావు అని కొనియాడారు. నాడు ప్రవేశ పెట్టిన సంక్షేమ కార్యక్రమాలనే దేశంలో అన్ని రాజకీయ పార్టీలు ఆచరించడం తెలుగుజాతికి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో శాయంపేట మాజీ కార్పొరేటర్ మాడిశెట్టి శివశంకర్, సీనియర్ నాయకులు సిలువేరు కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, కరిమిల్ల సంపత్ రావు, భూషబోయిన సంపత్ యాదవ్, కరిమిల్ల వెంకటేశ్వరావు, చిమ్మని గోపి, అభిమానులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com